కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -265 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 05-10-2026 సోమవారం పేజీలు : 4



# రైతుల కోసం రణం!

- ఈవీఎంలకు గుడ్‌బై.. పేపర్ బ్యాలెట్ రావాలి!
- కరువుపై కవిత ఫైర్.. సర్కారుపై గురి!
- రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాలి!
- కరువు మండలాలు ప్రకటించాలి!
- తాగునీటి ముప్పు.. సర్కార్ అప్రమత్తం కావాలి!
- కృష్ణా జలాలపై సర్కార్ విఫలం!
- ఆస్పత్రులపై 'ఆపరేషన్ బ్లూ కోడ్'!
- 317 జీవో బాధితులకు న్యాయం చేయాలి!
- ఎన్నికలపై సమరం.. ఢిల్లీ వరకు పోరాటం!

**న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర దుర్భిక్షమైన కరువును ఎదుర్కోవడంలో ప్రస్తుత ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా ఫెయిల్ అయ్యారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అభావ వర్షపాతం వల్ల తీవ్ర దుర్భిక్షం నెలకొందని, కొన్ని చోట్ల భూగర్భ జలాలు 20 మీటర్ల లోతుకు పడిపోయి రైతులు పంటలను కాల్చుకుంటున్నారని కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జులైలో 1%, ఆగస్టులో 38%, సెప్టెంబరులో 30% తక్కువ వర్షపాతం నమోదైందని, సూపర్ ఎల్ నినో హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం సమీక్షలు నిర్వహించలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నాగార్జున సాగర్‌లో వరుణయాగం చేసి ప్రజలను దేవుడి దయకు వదిలేశారని విమర్శించారు.

మిగతాది 2 లో..

# బీజేపీ-జనసేన పొత్తుపై క్లారిటీ!

**న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** తెలంగాణలో త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలపై పొలిటికల్ హీట్ మొదలైంది. ముఖ్యంగా హైదరాబాద్- మహబూబ్‌నగర్- రంగారెడ్డి, వరంగల్-నల్గొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ స్థానాలకు జరగబోయే ఎన్నికల్లో గెలిచి నిలిచేందుకు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఇందులో భాగంగా అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి గెలుపు కోసం ప్రజాక్షేత్రంలోకి వెళ్లగా మిగతా పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు

2 లో

# ఇండోనేషియాలో భారీ భూకంపం!


2 లో

న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్): ఆగ్నేయాసియా ద్వీపదేశమైన ఇండోనేషియాలో ఆదివారం వేకువజామున బలమైన భూకంపం సంభవించింది. భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 05:07 గంటల సమయంలో భూమి తీవ్రంగా కంపించినట్లు భారత భూకంప అధ్యయన కేంద్రం అధికారికంగా వెల్లడించింది.

# తెలంగాణలో బార్‌లు బంద్!

- ఫీజుల పెంపుపై యజమానుల ఆగ్రహం
- అక్టోబర్ 5న రాష్ట్రవ్యాప్త బంద్
- 1200 బార్లు మూతపడే అవకాశం
- స్లాబ్ 8 నుంచి 20 శాతానికి
- లైసెన్స్ ఫీజు రూ.44 లక్షలకు
- వేలాది ఉద్యోగాలపై ప్రభావం
- ఎక్సైజ్ కమిషనరేట్ ముట్టడికి పిలుపు



2 లో

**న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** తెలంగాణలో బార్ అండ్ రెస్టారెంట్ల లైసెన్స్ ఫీజులు, నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. లైసెన్స్ ఫీజుల పెంపు, నిబంధనలకు నిరసనగా అక్టోబర్ 5న (సోమవారం) రాష్ట్రవ్యాప్తంగా బార్ అండ్ రెస్టారెంట్ల బంద్‌కు తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 1200 బార్ అండ్ రెస్టారెంట్లు బంద్ కానున్నాయి. ఇటీవల కేబినెట్ సమావేశంలో ప్రివిలేజ్ ఫీజుతో పాటు బార్ స్లాబ్‌ను 8 శాతం నుంచి ఏకంగా 20 శాతానికి పెంచాలని, లైసెన్స్ ఫీజును రూ. 40 లక్షల నుంచి రూ. 44 లక్షలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన అసోసియేషన్, ఈ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

# ఓటమి భయంతోనే కాంగ్రెస్ డ్రామాలు



2 లో

- ఖైరతాబాద్‌పై కాంగ్రెస్‌లో వణుకు
- ఓటమి భయంతోనే డ్రామాలంటూ ఫైర్
- రేవంత్‌పై డీకే అరుణ విమర్శలు
- దమ్ముంటే రాజీనామాలు చేయాలి
- ఎమ్మెల్యేలతో ఉప ఎన్నికలకు సవాల్
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు
- రెండు పార్టీలదీ ఒకే తీరు

# సీజేపీ చీఫ్‌పై హత్య కేసు డిమాండ్


2 లో

- వాజీ పార్క్ నిరసనపై తీవ్ర వివాదం
- వృద్ధుడి మృతిపై సీజేపీ చీఫ్‌పై ఫిర్యాదు
- అభిజీత్ దీప్కేపై హత్య కేసు పెట్టాలని డిమాండ్
- అనుమతి లేకుండానే సభ నిర్వహించారంటూ ఆరోపణ
- నిరసనలో 75 ఏళ్ల వృద్ధుడి మృతి
- బీఎన్ఎస్, పోలీస్ యాక్ట్ కింద ఇప్పటికే కేసులు
- మైనర్ల వినియోగంపైనా ఎన్‌హెచ్ఆర్సీ విచారణ

# పంజరంలో పెడితే ప్రాణాలకే ముప్పు

- తెలంగాణ రాష్ట్ర పక్షి అరుదుగా మారింది
- ఆవాసాలు కోల్పోతున్న పాలపిట్టలు
- రసాయనాలతో ఆహారం విషతుల్యం
- పాత చెట్ల నరికివేతతో సంక్షోభం
- దసరాకు అక్రమంగా పక్షుల బంధనం
- రాష్ట్ర పక్షి ఉనికికి ముప్పు!
- పాలపిట్టను బంధించడం నేరమన్న అధికారులు


2 లో

**న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఒకప్పుడు పల్లెల్లోని పొలం గట్లపైనా, విద్యుత్ తీగలపైనా సందడి చేసిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట' (ఇండియన్ రోలర్) ఉనికి ఇప్పుడు ప్రమాదంలో పడింది. దసరా పండుగ రోజు జమ్మిపూజ తర్వాత పాలపిట్టను చూడటం మన సంస్కృతిలో శుభప్రదంగా భావిస్తారు. కానీ, కాలక్రమేణా మారుతున్న పర్యావరణ పరిస్థితులు, మానవ తప్పిదాల వల్ల ఈ నీలిరంగు అందాల పక్షి జాడ క్రమంగా కనుమరుగవుతోంది. ఒకప్పుడు సర్వసాధారణంగా కనిపించిన ఈ పక్షి, ఇప్పుడు అత్యంత అరుదుగా మారిపోయింది.

ఆవాసాలు మాయం.. ఆహారం విషతుల్యం

పట్టణీకరణ వేగవంతం కావడం, రియల్ ఎస్టేట్ వెంచర్లతో పచ్చని పొలాలు కాంక్రీట్ జంగిల్స్ గా మారడం పాలపిట్టల పాలిట శాపంగా మారాయి. సాధారణంగా ఇవి పాత చెట్ల తొర్రల్లో గూళ్లు కట్టుకుంటాయి. కానీ పాత చెట్లను విచక్షణారహితంగా నరికేస్తుండటంతో వీటికి ఆవాసాల కొరత ఏర్పడింది. మరోవైపు, వ్యవసాయంలో రసాయనిక పురుగుమందుల వాడకం విపరీతంగా పెరగడం కూడా వీటి పతనానికి కారణంగా తెలుస్తున్నది.

# ఓట్ల తొలగింపుపై ఒవైసీ ఫైర్!

- ఎంఐఎం నేతలపై కుట్ర ఉందంటూ ఒవైసీ
- చంచల్‌గూడ జైల్లో కుట్ర అంటూ ఆరోపణ
- జైలు సూపరింటెండెంట్‌పై సంచలన వ్యాఖ్యలు
- నకిలీ ఫామ్-7లపై ఒవైసీ ఫైర్
- ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్
- భారీ ఆందోళనలకు ఒవైసీ హెచ్చరిక
- ఎస్ఐఆర్‌పై బీజేపీని టార్గెట్ చేసిన ఒవైసీ

2 లో

# కూటమికి ఎదురులేదు

- రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి లక్ష్యం
- పేదల కోసం 3 లక్షల ఇళ్లు
- మరో 9 లక్షల ఇళ్లకు కేంద్రం సిద్ధం
- మూడు నెలల్లో ఇంటి నిర్మాణం
- 3డీ ప్రింటింగ్‌తో వేగంగా ఇళ్లు
- 2029 నాటికి అందరికీ సొంతిల్లు
- గ్రామీణాభివృద్ధికి 1.30 లక్షల కోట్లు


2 లో

**న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** గుంటూరు జిల్లా బుర్రిపాలెం నుంచి సినిమా రంగానికి సూపర్ స్టార్ కృష్ణ హీరోగా వస్తే, రాజకీయాల్లోకి పెమ్మసాని చంద్రశేఖర్ రూపంలో మరో హీరో వచ్చారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బుర్రిపాలెంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణాలు, 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ పైలట్ ప్రాజెక్ట్ శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. రాష్ట్రానికి 75 వేల ఇళ్లు సరిపోవు, 3 లక్షల ఇళ్లు కావాలని అడగ్గానే కేంద్రం వెంటనే మంజూరు చేసిందని, వచ్చే రోజుల్లో మరో 9 లక్షల ఇళ్లను ఇచ్చేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు.

# గాల్లోంచి రాళ్లు.. గ్రామంలో టెన్షన్!

- అప్పాజీపేటలో వారం రోజులుగా రాళ్ల వాన
- రాత్రివేళ రాళ్లు పడుతుండటంతో భయాందోళనలు
- రాళ్ల దెబ్బలకు దెబ్బతిన్న ఇళ్లు, పైకప్పులు
- పోలీసుల గస్తీలోనూ ఆగని రాళ్ల దాడి
- కొండపైకి వెళ్లినా కొనసాగిన రాళ్ల ఘటన
- ఆకతాయిల పనేనా? ఇతర కోణాల్లో పోలీసుల దర్యాప్తు

2 లో

# రాజ్యసభపై బీజేపీ ఫోకస్!

- ఉత్తరాఖండ్‌లో దినేష్ ఆర్యకు అవకాశం
- బెంగాల్ ఉపఎన్నికకు కోయెల్ మల్లిక్ ఎంపిక
- బీజేపీ అభ్యర్థులపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి
- బెంగాల్‌లో టీఎంసీ నుంచి బీజేపీకి కోయెల్
- అక్టోబర్ 16న రాజ్యసభ ఉపఎన్నిక
- త్వరలో ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియ

2 లో

# రాజ్యసభపై బీజేపీ ఫోకస్!


भारतीय जनता पार्टी
केन्द्रीय कार्यालय
6ए, दीनदयाल उपाध्याय मार्ग, नई दिल्ली-110002
फोन: 011-23500000 फैक्स: 011-23500190
दिनांक: 04.10.2026

प्रेस विज्ञप्ति

भारतीय जनता पार्टी की केंद्रीय चुनाव समिति ने उत्तराखंड में होने वाले राज्यसभा द्विवार्षिक चुनाव एवं पश्चिम बंगाल में होने वाले राज्यसभा उप-चुनाव 2026 हेतु निम्नलिखित नामों पर अपनी स्वीकृति प्रदान की है।

राज्यसभा द्विवार्षिक चुनाव 2026

| राज्य का नाम | क्र. | उम्मीदवार का नाम |
|---|---|---|
| उत्तराखंड Uttarakhand | 1. | श्री दिनेश आर्य Shri Dinesh Arya |

राज्यसभा उप-चुनाव 2026

| राज्य का नाम | क्र. | उम्मीदवार का नाम |
|---|---|---|
| पश्चिम बंगाल West Bengal | 1. | श्रीमती रुक्मिणी मल्लिक (कोयल मल्लिक) Smt. Rukmini Mallick (Koel Mallick) |

(तरुण चुग)
सांसद (राज्य सभा) एवं राष्ट्रीय मुख्यालय प्रभारी

**న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి అధికార భారతీయ జనతా పార్టీ తన అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లో జరగనున్న రాజ్యసభ ఎన్నికల కోసం దినేష్ ఆర్యను, అలాగే పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న రాజ్యసభ ఉపఎన్నిక కోసం ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు రుక్మిణి మల్లిక్‌ను పార్టీ అభ్యర్థులుగా ఖరారు చేసింది. దినేష్ ఆర్య ఉత్తరాఖండ్ పార్టీలో సుదీర్ఘకాలంగా క్రియాశీలకంగా పనిచేస్తున్న అంకితభావం గల అభ్యర్థిగా ఆయనకు గుర్తింపు ఉంది. రాష్ట్రంలో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ ఉండటంతో ఈ స్థానాన్ని పార్టీ సులభంగా దక్కించుకునే అవకాశం ఉంది.

పశ్చిమ బెంగాల్‌లోని రాజ్యసభ ఉపఎన్నిక కోసం రుక్మిణి మల్లిక్ అలియాస్ కోయెల్ మల్లిక్‌ను బీజేపీ బరిలోకి దింపింది. గతంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కోయెల్ మల్లిక్, ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఇప్పుడు ఆమెకు బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నది. అక్టోబర్ 16న జరగనున్న ఈ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకానుంది.

# బీజేపీ-జనసేన పొత్తుపై క్లారిటీ!

మొదటి పేజీ తరువాయి

ధీటైన అభ్యర్థుల కోసం వేట కొనసాగిస్తూ రాజకీయాన్ని మరింత రంజుగా మారుస్తున్నాయి.

వరంగల్‌లో బీజేపీ-జనసేన మధ్య పొత్తు!:

క్షేత్రస్థాయిలో నేరుగా ప్రజలు, ముఖ్యంగా గ్రాడ్యుయేట్లు ఇవ్వబోయే తీర్పు కావడంతో రెండేళ్లలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ఎన్నికలను సెమీ ఫైనల్స్ గా పార్టీలు భావిస్తున్నాయి. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో తమ సత్తా చాటి ప్రజామద్దతు తమకే ఉందని నిరూపించుకునేందుకు పార్టీలు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఎన్డీయే కూటమిలో కీలకంగా ఉన్న బీజేపీ-జనసేన మధ్య పొత్తు ఎలా ఉండబోతోందనే చర్చ తెరమీదకు వస్తోంది. ఇటీవల తెలంగాణ రాజకీయాలపై దృష్టి సారించిన జనసేనాని పవన్ కల్యాణ్ నల్గొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గానికి ఇప్పటికే తమ అభ్యర్థిని ప్రకటించారు. జనసేన అభ్యర్థిగా తెలంగాణ వైద్యారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావును పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. దీంతో ఎన్నికల సమయానికి కూటమిలో కీలకంగా ఉన్న బీజేపీ, జనసేన మధ్య ఎలాంటి బంధం ఉండబోతోందనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య పొత్తు అంశంపై తాజాగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు.

జనసేనతో మాట్లాడుతాం:

తాజాగా ఓ న్యూస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన రామచందర్ రావు.. జనసేన బీజేపీ పార్ట్నర్ అని, వరంగల్ స్థానానికి అభ్యర్థిని ప్రకటించిన జనసేనతో తాము మాట్లాడుతామన్నారు. జనసేనతో కోఆర్డినేషన్, కోఆపరేషన్ తో వ్యవహరిస్తామన్నారు. అయితే ఇరు పార్టీల మధ్య చర్చించే విషయం మా అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. కానీ వరంగల్ స్థానంలో గతంలో బీజేపీ గెలిచిన చరిత్ర ఉందన్నారు. జనసేన అభ్యర్థిని ప్రకటించడం తప్పేం కాదని మా నేతలు కూడా యాక్టివ్?గా పని చేసుకుంటున్నారని ఈ స్థానంలో పోటీ చేయాలని చాలా మంది తమ వద్దకు వస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ, పొత్తుపై జనసేన తమను సంప్రదిస్తే దీనిపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అయితే ఎన్డీయేలో ఈ రెండు పార్టీలు మంచి మిత్రపక్షంగా ఉన్నప్పటికీ తెలంగాణ విషయంలో మాత్రం ఈ రెండు పార్టీల మధ్య పొత్తులు, ఫ్రెండ్షిప్ విషయంలో పొసగడం లేదనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా జనసేన పోటీ, మద్దతు విషయంలో టీ బీజేపీలోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో ఈ రెండు పార్టీల మధ్య సరైన స్పష్టత లేకపోవడంతో ఇటు జనసేన, అటు బీజేపీ శ్రేణులు అయోమయంలో పడుతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని గ్రాడ్యుయేట్ ఎన్నికల నాటికి ఇరు పార్టీలు ఏదో ఓ నిర్ణయాలు వెలువరిస్తాయా లేక ఇలాగే శ్రేణులను కన్ఫ్యూజన్ లోనే కంటిన్యూ చేస్తారా అనేది చూడాలి.

# తెలంగాణలో బార్‌లు బంద్!

మొదటి పేజీ తరువాయి

ఒక్కో బార్‌పై దాదాపు 60 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రభుత్వ తాజా నిర్ణయాల వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.




ఇప్పటికే తామంతా తీవ్ర నష్టాల్లో ఉన్నామని బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా లైసెన్స్ ఫీజును దాదాపు రూ.33 లక్షల నుంచి రూ.56 లక్షల వరకూ చెల్లిస్తున్నామని, ప్రివిలేజ్ ఫీజుతో తమపై అదనంగా రూ.30 లక్షల భారం పడుతుందని వాపోయారు. గతంలో ఎన్నడూ లేని ఇలాంటి ఫీజులను ఇప్పుడెందుకు వసూలు చేయాలని నిర్ణయించారో అర్థంకావడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఎక్సైజ్ కమిషనరేట్‌ను ముట్టడిస్తామని అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు.

# ఓట్ల తొలగింపుపై ఒవైసీ ఫైర్!



**న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఎంఐఎం నేతలపై దాడులకు కుట్ర చేస్తున్నారని ఆపార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన ఆరోపణలు చేశారు. దాడులకు చంచల్ గూడ జైల్లో కుట్ర పన్నుతున్నారని ఇందుకోసం జైల్లో ఖైదీలతో సూపరింటెండెంట్ సమావేశం అవుతున్నారని హాట్ కామెంట్స్ చేశారు. తాజాగా హైదరాబాద్ లోని మీలాద్ మైదాన్‌లో జరిగిన 57వ 'జల్సా-ఎ-మిలాద్-ఉన్-నబి' సభలో ఒవైసీ మాట్లాడారు. లంచం తీసుకుని రౌడీషీటర్ల విడుదలకు సూపరింటెండెంట్ సహకరిస్తున్నాడని, అమాయకుల హత్యలకు పాల్పడే వారిని బహిష్కరించాలన్నారు.

మౌనంగా కూర్చోవొద్దు:

ఓటర్ల జాబితా ప్రత్యేక పోలింగ్ సవరణ ప్రక్రియలో నకిలీ ఫారమ్-7 దరఖాస్తులను సమర్పిస్తూ ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ఒవైసీ ఆరోపించారు. తప్పుడు ఫారమ్-7లు దాఖలు చేస్తే బాధ్యులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దరఖాస్తుదారుల వివరాలు లేకుండా ఓట్ల తొలగింపునకు ఫారాలు వస్తున్నాయని, ఈ వ్యవహారంపై ఎంఐఎం మౌనంగా కూర్చోదని, ఈ పరిస్థితి ఆగకపోతే ఢిల్లీలోని జంతర్‌మంతర్ నిరసనల కంటే భారీగా హైదరాబాద్ రోడ్లు, వీధుల్లో ఆందోళనలు చేపడతామని ఒవైసీ హెచ్చరించారు.

ఎన్ఆర్‌సీ అమలుకు 'సర్' దొడ్డిదారి:

దరఖాస్తుదారుడి వివరాలు లేకుండానే ప్రింటెడ్ ఫారమ్-7 ఇస్తున్నారని ఇది ముస్లిం వ్యక్తుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు బీజేపీ, సంఘ్ పరివార్‌లకు చెందిన వ్యక్తులు చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. ఫారమ్-7 విషయం ఏమాత్రం అనుమతించకూడదని ఈసీ దీన్ని గమనించాలన్నారు. ఎస్ఐఆర్ అనేది ఎన్ఆర్‌సీ అమలుకు దొడ్డిదారిగా అభివర్ణించారు. ఈ ప్రక్రియను బీజేపీ పౌరసత్వ పరీక్షగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

# రాష్ట్ర పక్షి ఉనికికి ముప్పు!

మొదటి పేజీ తరువాయి

పంటలకు హాని చేసే కీటకాలను తింటూ రైతుకు మిత్రుడిగా, పర్యావరణ సమతుల్యతకు తోడ్పడే పాలపిట్టలు.. విషతుల్యమైన కీటకాలను తిని ప్రాణాలు కోల్పోతున్నాయని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంజరంలో పెడితే ప్రాణాలు తీసినట్లే..

దసరాకు పాలపిట్టను దర్శించుకునే ఆనవాయితీని కొందరు వ్యాపారంగా మార్చుకుంటున్నారు. అక్రమంగా వీటిని పట్టుకుని పంజరాల్లో బంధించి ప్రదర్శనకు పెడుతున్నారు. ఇటీవల అరణ్యభవన్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్) వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. 'పాలపిట్ట ఎగురుతూ గాల్లోనే ఆహారం తీసుకుంటుంది. దాన్ని బోనులో బంధిస్తే ఆహారం తీసుకోక చనిపోయే ప్రమాదం ఉంది' అని స్పష్టం చేశారు. వన్యప్రాణి చట్టం ప్రకారం పాలపిట్టలను బంధించడం నేరమన్న ఆయన, గతేడాది ఇలా బంధించిన 28 పక్షులను రక్షించి వదిలేసినట్లు గుర్తుచేశారు. దసరా ఉత్సవాల్లో పక్షులను బంధించకుండా చూడాలని దేవాదాయశాఖను సైతం కోరారు. 'సంప్రదాయం పేరుతో మూగజీవాలను బంధించడం కాకుండా.. స్థానిక చెట్లను పెంచి వాటి సహజ ఆవాసాలను కాపాడినప్పుడే భావితరాలకు మన 'రాష్ట్ర పక్షి'ని సజీవంగా చూపగలం.. పక్షి కనిపిస్తే దూరం నుంచి స్వేచ్ఛగా చూసి ఆనందిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం' అని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

# కూటమికి ఎదురులేదు

మొదటి పేజీ తరువాయి

మనందరికీ మామగా నిలిచిన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు3 లక్షల ఇళ్లను అందించినందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి రాత్రింబవళ్లు శ్రమిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకే ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి జతకట్టామని వివరించారు. పేదవాడికి నివాస హక్కు కల్పించాలని తొలిసారిగా ఆలోచించిన నాయకుడు ఎన్టీఆర్ అని గుర్తుచేస్తూ, గత 12 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల ఇళ్లను నిర్మించిందని పేర్కొన్నారు. ఏపీలో 2029 నాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు కట్టించి తీరడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

3 నెలల్లోనే ఇంటి నిర్మాణం

పేదల ఇళ్ల నిర్మాణంలో నాణ్యత, వేగం కోసం తొలిసారిగా '3డీ కాంక్రీట్ ప్రింటింగ్' టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ పరిజ్ఞానంతో కేవలం 3 నెలల్లోనే ఇంటి నిర్మాణం పూర్తి కావడమే కాకుండా, సాధారణ ఉష్ణోగ్రత కంటే 8 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని చెప్పారు. అలాగే గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రాబోయే ఐదేళ్లలో రూ. లక్షా 30 వేల కోట్ల విలువైన పనులకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రజలు వేసిన ఏ ఒక్క ఓటు వృథా కాకుండా రాష్ట్రంలో ప్రతి రంగంలోనూ సుపరిపాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు.

ఇదే సమయంలో గత వైకాపా ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ హయాంలో నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వడం వల్లే దాదాపు 4 లక్షల మంది వాటిని తిరస్కరించారని విమర్శించారు. అంతేకాకుండా 2019-24 మధ్యకాలంలో ఏకంగా 6 లక్షల పేదల ఇళ్లను రద్దు చేసి వారి పొట్టకొట్టారని మండిపడ్డారు. అన్ని అడ్డంకులను అధిగమించి పేదలకు అన్ని వసతులతో కూడిన ఇళ్లను అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# సీజేపీ చీఫ్‌పై హత్య కేసు డిమాండ్



**న్యూస్ డెస్క్ 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** ముంబైలోని చారిత్రక శివాజీ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన వివాదాస్పద నిరసన ప్రదర్శన తీవ్ర మలుపు తిరిగింది. అనుమతి లేకుండా నిర్వహించిన ఈ ఆందోళన సందర్భంగా ఓ వృద్ధుడు మృతి చెందిన వ్యవహారంలో.. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ 'శివాజీ పార్క్ సిటిజన్స్ ఫోరం' పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేసింది. గాంధీ జయంతి (అక్టోబర్ 2) నాడు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా డిమాండ్‌తో ముంబై పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ వేలాది మందితో ఈ సభను నిర్వహించారని ఫోరం ఆరోపించింది. ఈ ఆందోళనలో పాల్గొనేందుకు వచ్చిన 75 ఏళ్ల వృద్ధుడు గేట్ నెంబర్ 6 వద్ద తీవ్ర అస్వస్థతకు గురై ఛాతీ నొప్పితో కుప్పకూలారని, ఆసుపత్రికి తరలించేలోపే గుండెపోటుతో మరణించారని పేర్కొంది. కోర్టు ఆదేశాలు, పోలీస్ ఆంక్షలను ధిక్కరించి నిరసన చేపట్టినందునే ఈ మరణం సంభవించిందని, కాబట్టి నిర్వాహకుడైన దీప్కేపై మర్డర్ కేసు పెట్టాలని ఫోరం ప్రతినిధులు పట్టుబట్టారు.

ఈ ఘటనతో ఇప్పటికే వివాదాల్లో చిక్కుకున్న సీజేపీ నిర్వాహకులపై చట్టపరమైన ఉచ్చు మరింత బిగుస్తోంది. అక్రమంగా గుమిగూడటం, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించడంపై గతంలోనే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), మహారాష్ట్ర పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు కాగా, తాజాగా స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. మరోవైపు ఈ నిరసనలో మైనర్ పిల్లలను సైతం అడ్డుపెట్టుకున్నారంటూ జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. వరుస వివాదాలు, వృద్ధుడి మరణం పై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతున్నప్పటికీ, తాము చేపట్టిన ఉద్యమం ఆగదని, తదుపరి కార్యాచరణను కొనసాగిస్తామని సీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

# ఇండోనేషియాలో భారీ భూకంపం!



న్యూస్ డెస్క్ 04 అక్టోబర్ (బిఎన్ఎస్): ఆగ్నేయాసియా ద్వీపదేశమైన ఇండోనేషియాలో ఆదివారం వేకువజామున బలమైన భూకంపం సంభవించింది. భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 05:07 గంటల సమయంలో భూమి తీవ్రంగా కంపించినట్లు భారత భూకంప అధ్యయన కేంద్రం అధికారికంగా వెల్లడించింది. రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 5.2గా నమోదైంది. భూ ఉపరితలం నుంచి సుమారు 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. తెల్లవారుజామున ప్రజలంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా భూమి కంపించడంతో భయాందోళనకు గురైన స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసి రోడ్లపైకి చేరుకున్నారు.

ఈ భూకంపం వల్ల ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం అందలేదని, సునామీ ముప్పు కూడా లేదని విపత్తు నిర్వహణ విభాగం ప్రాథమికంగా స్పష్టం చేసింది. అయితే భూకంప కేంద్రం కేవలం 10 కిలోమీటర్ల లోతులోనే ఉండటంతో సమీప ప్రాంతాల్లో ప్రకంపనల ప్రభావం బలంగా కనిపించిందని అధికారులు తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో టెక్టానిక్ ప్లేట్ల నిరంతర కదలికల కారణంగా ఇండోనేషియాలో తరచూ తీవ్ర భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు చోటుచేసుకుంటూ ఉంటాయి. అధికారులు ప్రస్తుత పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# గాల్లోంచి రాళ్లు.. గ్రామంలో టెన్షన్!



**న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో ఓ వింత పరిస్థితి నెలకొంది. ఆ గ్రామంలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. ఈ పరిణామంతో రాత్రైతే చాలు వణికిపోతున్న జనం.. ఆ ఊర్లో ఉండాలంటే భయపడిపోతున్నారు. ఈ ఘటన వల్ల ఇప్పటికే చాలా ఇళ్లు డ్యామేజ్ అయ్యాయి. ఇళ్ల పైకప్పులు పగిలిపోయాయి. ఆ రాళ్లు ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలియక ఆ ఊరి ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. రాత్రి పూట అందరూ ఒకే చోటకు చేరుతున్నారు. ఈ విషయంపై ప్రజలు రకరకాలుగా ఆలోచనలు చేస్తున్నారు. ఎవరైనా కావాలనే చేస్తున్నారా? దైవం పనా? దెయ్యం పనా? అనే ఊహాగానాలు జోరందుకున్నాయి.

ఈ బాధ భరించలేక ప్రజలు చివరి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న తర్వాత నలుగురు పోలీసులు ఆ గ్రామంలో గస్తీ కూడా నిర్వహించారు. ఆ సమయంలో కూడా గాల్లోంచి రాళ్లు పడ్డాయి. అయినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై ప్రజలు స్వామీజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. పోలీసులతో పాటు సుమారు 20 మంది యువకులు కూడా ఈ మిస్టరీని ఛేదించడానికి కొండపైకి వెళ్లి పరిశీలించారు. అప్పుడు కూడా ఇళ్లపై రాళ్లు వచ్చి పడ్డాయి.

దీంతో ఆ గ్రామ ప్రజలు ఇది కచ్చితంగా అదృశ్య శక్తుల పనే.. అని అనుమానిస్తున్నారు. అయితే అలాంటి దానికి ఆస్కారం లేదని, ఇది ఆకతాయిలు చేస్తున్న పనిగా కనిపిస్తుందని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే పోలీసులు నిఘా ఉన్న సమయంలో రాళ్లు ఎలా పడుతున్నాయో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు వ్యక్తులే కావాలనే రాళ్లు విసురుతూ భయాందోళనకు గురి చేస్తున్నారా? దీనికి ఇంకేదైనా కారణముందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతుంది. అయితే రాళ్ల దాడి వల్ల ప్రజలు రాత్రిళ్లు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. ఎక్కువగా సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రాళ్లు పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. చాలామంది గ్రామానికి వచ్చి వీడియోలో, ఫోటోలు తీసుకెళ్తున్నారని కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. దీంతో తమకు భద్రత కల్పించాలని గ్రామస్థులు పోలీసులను కోరుతున్నారు.

గతంలోనూ ఇలాంటి ఘటనలు...

అయితే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇలా జరిగిన ఘటనలు అనేకం జరిగాయి. ప్రకాశం జిల్లా, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని గ్రామాల్లో అచ్చం ఇలాగే రాత్రైతే ఇళ్లపై రాళ్లు పడేవి. 'జన విజ్ఞాన వేదిక' ప్రతినిధులు, పోలీసులు నైట్ విజన్ కెమెరాలు పెట్టి దర్యాప్తు చేశారు. ఆ విచారణలో గ్రామస్థులే ఆస్తి తగాదాల వల్ల ఈ రాళ్లు విసిరినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అప్పాజీపేటలో కూడా పోలీసులు సాధారణ గస్తీని నిర్వహించే బదులు సీసీ కెమెరాలు, డ్రోన్లు లేదా నైట్ విజన్ కెమెరాలు ఉపయోగిస్తే ఈ రాళ్ల వాన మిస్టరీ త్వరగా వీడే అవకాశం ఉంటుంది.

# ఓటమి భయంతోనే కాంగ్రెస్ డ్రామాలు



**న్యూస్ డెస్క్, 04 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఖైరతాబాద్ నియోజకవర్గంలో జరగబోయే ఎన్నికల్లో ఓడిపోతామనే ముందస్తు భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోర్టు ద్వారా పిటిషన్లు వేయించారని బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహిస్తే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా అదే అప్రజాస్వామిక విధానాలను కొనసాగిస్తోందని మండిపడ్డారు. ఖైరతాబాద్‌లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడం ఖాయమని స్పష్టం కావడంతోనే కాంగ్రెస్ నాయకత్వంలో వణుకు మొదలైందని వ్యాఖ్యానించారు.

దమ్ముంటే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలి

కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా తమ పాలనపై, పది నెలల్లో సాధించిన అభివృద్ధిపై విశ్వాసం ఉంటే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని డీకే అరుణ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలకు కనీస నైతికత ఉంటే తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి ప్రజా తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా నిష్పక్షపాతంగా కేంద్ర నిధులను కేటాయిస్తుంటే, ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం రాష్ట్రాన్ని దారుణంగా అప్పుల పాలు చేశాయని ఆరోపించారు.

అభివృద్ధి శూన్యం.. ప్రజలు గుణపాఠం చెప్పాలి

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే నాణేనికి బొమ్మ, బొరుసు లాంటివని, ఈ రెండు పార్టీల పాలనలోనూ తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని డీకే అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నిధులు లేవంటూ చేతులు దులుపుకోవడం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. ఈ రెండు పార్టీల వైఫల్యాలను, మోసపూరిత వైఖరిని గమనిస్తున్న ప్రజలు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లో భారతీయ జనతా పార్టీని భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని ఆమె కోరారు.

# రైతుల కోసం రణం!

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ఉన్న 120 కోట్ల ఎకరాల పంటను కాపాడుకునేందుకు, ప్రభుత్వానికి ఎంత ఖర్చైనా నవంబర్ వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని, గ్రామాల్లో కనీసం 6-7 గంటల కరెంట్ కూడా అందడం లేదని డిమాండ్ చేశారు.

కరువు మండలాలు..

పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ కరువు మండలాలను ముందే ప్రకటించి కేంద్ర సాయం పొందేందుకు సిద్ధమయ్యాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికీ ఆ పని చేయలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి కరువు మండలాలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, దక్షిణాది రాష్ట్రాలలో తీవ్ర కరువు తాండవిస్తున్నందున ప్రధాని నరేంద్ర మోడీ ఆదుకోవాలని, ఉచిత విద్యుత్, ఆర్థిక సాయం అందించకపోతే ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. ప్రభుత్వం సింగరేణి బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యుత్ కొరత ఏర్పడి, దాని ప్రభావం వల్ల నిత్యావసరాలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని మండిపడ్డారు.

తాగునీటి సమస్య వచ్చే ప్రమాదం..

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో తీవ్ర తాగునీటి సమస్య వచ్చే ప్రమాదం ఉందని, రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయని హెచ్చరించారు. కృష్ణా జలాల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మహబూబ్నగర్ నుంచి కుప్పంకు నీటిని తరలిస్తుంటే ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నార్లపూర్ రిజర్వాయర్, కల్వకుర్తి ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెంది. ఇప్పుడు కర్ణాటకను నీళ్లు అడుగుతూ బిల్డప్‌లు ఇస్తున్నారని విమర్శించారు. రైతుల సమస్యలపై తమ పార్టీ ప్రతినిధులు గ్రామాగ్రమానికి వెళ్లి ప్రత్యేక కార్యాచరణ చేపడతారని స్పష్టం చేశారు.

ప్రత్యేక బృందాన్ని నియమిస్తాం..

ఆరోగ్య రంగంలో పరిస్థితులను అధ్యయనం చేయడానికి 'ఆపరేషన్ బ్లూ కోడ్' పేరిట తమ పార్టీ బృందాలు ఆసుపత్రులను పరిశీలిస్తున్నాయని తెలిపారు. భూపాలపల్లి ఆసుపత్రిలో సీలింగ్ కూలిన ఘటన, రిమ్స్ సంఘటనలపై పోరాటం చేయడం వల్లే ప్రభుత్వం రూ.11 కోట్లు విడుదల చేసిందని, అయితే ఈ విషయాలను వెలుగులోకి తెచ్చిన పార్టీ కార్యకర్తలను పోలీసులు బెదిరించడం సరైనది కాదని స్పందించారు. 317 జీవో బాధితులైన ఉపాధ్యాయులు, పోలీసుల సమస్యలను ప్రభుత్వం మూడేళ్లుగా పట్టించుకోవడం లేదని, గాంధీ జయంతి రోజే ఉపాధ్యాయులపై లాఠీఛార్జ్ చేయడం కాంగ్రెస్ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. భవిష్యత్తులో పాఠశాలల్లో కనీస సౌకర్యాల పరిశీలనకు కూడా ప్రత్యేక బృందాన్ని నియమిస్తామని ప్రకటించారు.

మళ్లీ పేపర్ బ్యాలెట్ విధానం..

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం ఈవీఎంలను రద్దు చేసి, అమెరికా, బ్రిటన్ దేశాల మాదిరిగా మళ్లీ పేపర్ బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని, దీనికోసం ఢిల్లీ వరకు వెళ్లి పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు. సర్ ప్రక్రియ తప్పిదాలకు సీఈసీ రాజీనామా తాత్కాలిక పరిష్కారమని వ్యవస్థలో శాశ్వత మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు రాష్ట్రంలో రాబోయే ఏ ఎన్నికల్లోనైనా తెలంగాణ రక్షణ సేన పోటీకి సిద్ధంగా ఉందని, ఎన్నికలను ప్రజా ఎజెండా వినిపించే వేదికగా భావిస్తామని తెలిపారు.

### కడప ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి

# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది..!

**నేడు జరగబోవు కడప జలజీవన్ మిషన్ ప్రారంభ సభ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇంచార్జి మంత్రి సవిత..**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 04: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖా మంత్రి సవిత తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం లో ప్రజలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా జల జీవన్ మిషన్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆమె చెప్పారు. నేడు ప్రొద్దుటూరు లో జరగనున్న సీఎం పర్యటన సందర్భంగా ఆమె ఏర్పాట్లను డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, టీడీపి జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, జనసేన నాయకులు రమణ లతో కలిసి పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.30 వేల కోట్లతో జల జీవన్ మిషన్ పనులు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. నేటి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరవుతున్నారని తెలిపారు. సుమారు లక్ష మంది ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో భోజనం, రవాణా, ట్రాఫిక్, వైద్య, వసతి, మరుగుదొడ్ల ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. కడప జిల్లాలో ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ విస్తరణ, స్టార్టప్ కడప, ఇన్వెస్ట్ కడప, స్మార్ట్ కిచెన్స్‌తో పాటు మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసి పెట్టుబడులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయించామని మంత్రి సవిత వెల్లడించారు

# అవినాష్ కూటమి అభివృద్ధి పై ఓపెన్ డిబెట్ కు సిద్ధమా..?

**రాష్ట్ర విప్, జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి...**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 04: కూటమి ప్రభుత్వ అభివృద్ధి విషయంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చర్చకు రావాలని రాష్ట్ర విప్ జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సవాల్ చేశారు. అభివృద్ధిపై చర్చ జరపడానికి జమ్మలమడుగు అయిన సరే, లేదా పులివెందుల అయిన సరే, తాను ఓపెన్ డిబేట్‌కు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. కడప జిల్లా జమ్మలమడుగు పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్ లో ఆదివారం కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నేతలపై తనదైన శైలిలో తీవ్రంగా విమర్శలు చేస్తూ వారిపై మండిపడ్డారు. వైయస్ వివేకానంద రెడ్డి కేసులో ముందస్తు బెయిల్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. వివేకానంద రెడ్డి మరణాన్ని గుండెపోటు పేరుతో నాటకం ఆడారని అవినాష్ రెడ్డి పై సూటిగా ఆరోపించారు. ఈ విషయంలో సొంత కుటుంబ సభ్యులను పక్కన పెట్టారంటూ వైఎస్ జగన్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాగే జగన్ రెడ్డి పై ఉన్న సీబీఐ, ఈడీ కేసులను ప్రస్తావిస్తూ.. విమర్శలు గుప్పించారు. వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డిలపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నాయుడిపై గతంలో కేసులు, ఆరోపణలతో ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. డీఎస్సీ విషయంలో నిరుద్యోగులను మోసం చేశారని నిరాధారమైన ఆరోపణలు చేయడం ఎంతవరకు కరెక్ట్ అన్నారు. గత 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చారని, రాబోయే 2029 ఎన్నికల్లోనూ వైయస్ఆర్సీపీ పార్టీకి మరియు ఆ పార్టీ అభ్యర్థులకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి పేర్కొన్నారు. నేడు కడప జిల్లా.. ప్రొద్దుటూరులో 30 వేల కోట్ల తో జల్ జీవన్ మిషన్ పనులు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఇనాగిరేషన్ కార్యక్రమానికి హాజరవుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యటనను విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని పిలుపు నిచ్చారు.

# రమణేశ్వరంలో నేడే 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' ఆవిష్కరణ మహోత్సవం!

**దివ్య శోభతో అలరారుతున్న రమణేశ్వరం**
**భారతదేశ అన్ని వైపుల నుంచి తరలివచ్చిన సాధుసంతులు**
**హిమాలయాల నుంచి దిగివచ్చిన అరుదైన సన్యాసులు**
**పీఠాధిపతులు, మఠాధిపతుల రాకతో రమణేశ్వరం కు కొత్త శోభ**





రమణేశ్వరం: సనాతన ధర్మ మహోజ్వల చారిత్రక ఘట్టానికి దివ్య పుణ్యక్షేత్రం రమణేశ్వరం వేదికగా మారింది. పరమ పూజ్య సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారు లోక కళ్యాణార్థం విరచించిన "సనాతన ధర్మ సహస్ర సూత్రాలు" గ్రంథావిష్కరణ మహోత్సవం నేడు (అక్టోబర్ 05, 2026) అత్యంత వైభవంగా జరగనుంది. భారతావనిలోని ప్రముఖ పీఠాధిపతులు, మఠాధిపతులు, సాధు సంతుల దివ్య సమక్షంలో జరగనున్న ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. రమణేశ్వరం క్షేత్రమంతా ఆధ్యాత్మిక కాంతులతో, వేద మంత్రాల ప్రణవ నాదాలతో మారుమోగుతోంది.

భారతీయ సనాతన సంస్కృతికి, ఆధ్యాత్మిక జ్ఞానానికి మహోన్నత నిదర్శనంగా నిలిచే ఈ మహోత్సవానికి జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల నుంచి ఆధ్యాత్మిక ప్రముఖులు తరలివచ్చారు. హిమాలయాల తుషార శైలాల నుంచి కన్యాకుమారి వరకు ఉన్న ప్రముఖ ఆశ్రమాలు, మఠాల నుంచి సాధు సంతులు, రుషులు, మునుల రాకతో రమణేశ్వరం ఒక సజీవ కైలాసంగా, భూలోక వైకుంఠంగా రూపాంతరం చెంది కళకళలాడుతోంది. మహాత్ముల పాదధూళితో ఈ పుణ్యభూమి పరమ పవిత్రతను సంతరించుకుంది.

ఈ మహోత్తర ఆధ్యాత్మిక యజ్ఞానికి మూలకారకులు, సాక్షాత్తు ఆధ్యాత్మిక తపస్సంపన్నులైన సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారు భక్తుల శ్రేయస్సును, సాధకుల వికాసాన్ని కాంక్షించి ఈ అమూల్యమైన దివ్య గ్రంథాన్ని రూపకల్పన చేశారు.

కరుణాంతరంగియైన సిద్ధగురువులు తమ అపారమైన తపోబలంతో, ఆత్మజ్ఞాన దీప్తితో మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. వారి దివ్య సన్నిధి, అమృత భాషణం సాధకుల హృదయాలలో ప్రశాంతతను, జ్ఞాన కాంతిని నింపుతాయి.

యుగయుగాలుగా మనకు లభించిన వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు మరియు వివిధ శాస్త్రాలలోని అత్యంత గూఢమైన, అగాధమైన ఆధ్యాత్మిక సత్యాలను సామాన్య భక్తులకు సైతం సులభంగా అర్థమయ్యే రీతిలో మలచడం సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారి అపారమైన జ్ఞాన పారమ్యానికి నిదర్శనం. ఎంతటి జటిలమైన ధర్మ సూత్రాన్నైనా అతి సరళమైన భాషలో విశ్లేషించి అందించడం వారి దివ్య వాగ్ధానానికి ఉన్న ప్రత్యేకత.

సంస్కృత భాషలోని క్లిష్టమైన గ్రంథాలను చదవలేక, వాటిలోని పరమార్థాన్ని గ్రహించలేక ఇబ్బంది పడుతున్న నేటి తరం భక్తుల కోసం మహర్షి గారు ఈ గ్రంథాన్ని దైనందిన జీవితానికి అన్వయించుకునేలా ప్రసాదించారు. నిత్య జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు, గందరగోళాలు, అధర్మ మార్గాల నుంచి భక్తులను రక్షించి, వారికి ధర్మబద్ధమైన మార్గాన్ని చూపించే వెయ్యి అమృత సూత్రాలను ఇందులో పొందుపరిచారు.



ప్రత్యేకించి నేటి యువత, గృహస్థులు మరియు ఆధ్యాత్మిక సాధకులు తమ రోజువారీ జీవితంలో ఆచరించదగిన మానవీయ విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, భక్తి మార్గాలను ఈ సూత్రాల రూపంలో గురువుగారు అందించారు. భక్తులందరూ ఈ గ్రంథాన్ని కేవలం పఠించడమే కాకుండా, ఇందులోని సూత్రాలను తమ జీవితంలో ఆచరించి ఆధ్యాత్మికంగా, లౌకికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలనేది సిద్ధగురువుల సత్సంకల్పం.

నేడు జరుగుతున్న ఈ ఆవిష్కరణోత్సవం సనాతన ధర్మ ప్రచార చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాంది. మహర్షి గారి దివ్య సంకల్పంతో, సకల సాధు సంతుల ఆశీస్సులతో రూపుదిద్దుకున్న ఈ "సనాతన ధర్మ సహస్ర సూత్రాలు" రాబోయే తరాలకు సరికొత్త ఆధ్యాత్మిక మార్గదర్శిగా నిలవనుందని పీఠాధిపతులు కొనియాడుతున్నారు.

వేగవంతమైన, యంత్రపూరితమైన ఆధునిక ప్రపంచంలో మానసిక ప్రశాంతతను, జీవన పరమార్థాన్ని వెతుక్కుంటున్న ప్రతి ఒక్కరికీ సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారి ఈ గ్రంథం ఒక సంజీవనిలా పనిచేస్తుంది. భ్రాంతిలో ఉన్న సమాజానికి జ్ఞానమనే వెలుగును ప్రసరింపజేసే దివ్య దీపికగా ఈ సహస్ర సూత్రాలు ప్రతి ఇంటా పూజలందుకోదగిన ఆధ్యాత్మిక నిధిగా భాసిల్లుతాయి.

నేటి చారిత్రాత్మక వేడుక కోసం రమణేశ్వరంలో శోభాయమానమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆవిష్కరణోత్సవానికి విచ్చేస్తున్న వేలాది మంది భక్తులకు, సాధు సంతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కమిటీలు సమగ్ర వసతి, రవాణా మరియు అన్నప్రసాద వితరణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. పుణ్యక్షేత్రమంతా ఉత్సవ వాతావరణం సంతరించుకుంది.

సనాతన ధర్మ వైభవాన్ని జగత్తుకంతటికీ చాటిచెప్పే ఈ మహోన్నత ఆధ్యాత్మిక ఉత్సవంలో భక్తులు, సనాతన ధర్మాభిమానులు విశేషంగా పాల్గొని, సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారి అమృత సభను తిలకించి, మహాత్ముల దివ్య ఆశీస్సులు పొందాలని అనుగ్రహ మహాపీఠం విజ్ఞప్తి చేస్తోంది.

### జమ్మలమడుగులో భగత్ సింగ్ విగ్రహం

# ఏర్పాటు చెయ్యాలి..!

**స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర విప్ ఆదినారాయణ రెడ్డికి వినతి పత్రం ద్వారా విన్నవించిన డివైఎఫ్ఐ..**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 04: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు షహీద్ భగత్ సింగ్ విగ్రహం జమ్మలమడుగు లో ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఆదివారం జమ్మలమడుగు రిపబ్లిక్ క్లబ్ నందు స్థానిక శాసన సభ్యులు రాష్ట్ర విప్ ఆదినారాయణ రెడ్డి కి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ... యువతకు స్పూర్తి దేశం కోసం చిన్న వయస్సులోనే ఉరికొయ్యను ముద్దాడిన గొప్ప దేశ భక్తుడు భగత్ సింగ్ అని తెలిపారు. మహనీయుల ఆశయాలను యువత నిరంతరం స్మరించు కోవడానికి వారి విగ్రహాలు అవసరం అన్నారు. కావున జమ్మలమడుగు పట్టణంలో భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిని కోరినట్టు తెలిపారు. భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు పట్ల ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించడం జరిగిందని శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు మహేష్ పాల్గొన్నారు.

### రావులపాలెంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో

# వాహనదారులకు మెరుగైన సౌకర్యం

**ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ...**



రావులపాలెం (బిఎన్ఎస్)అక్టోబర్ 4: ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం జంక్షన్లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మరియు రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ కు అడ్డంగా ఉన్న దుకాణాలను, భవనాలను తొలగించడం జరిగిందన్నారు. గతంలో ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగే ఎంతోమంది చనిపోవడం జరిగిందన్నారు. ప్రమాదాల నివారణకు, వాహనదారుల ప్రాణాలు కాపాడటానికి కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్, ఎస్సై రమేష్ ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరాన్ని తన దృష్టికి తీసుకుని వచ్చారన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుచేసిన పోలీసులను, స్పాన్సర్ చేసిన అక్షరా థియేటర్స్ యజమానికి నాగమోహన్ రెడ్డిని ఆయన అభినందించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అందరూ పాటించాలని, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనదారులు సహకరించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో సర్వీస్ రోడ్లు, డ్రైన్లు,డివైడర్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు సర్వీస్ రోడ్ల విస్తరణకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### నేడు సీఎం.. డిప్యూటీ సీఎం.. పర్యటన సందర్భంగా

# ప్రొద్దుటూరులో ట్రాఫిక్ ఆంక్షలు..!

**నేటి ఉదయం 7 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు అంటున్న ప్రొద్దుటూరు ఏఎస్పి విభూ కృష్ణ..**




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 04: కడప జిల్లా.. ప్రొద్దుటూరులో రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటించనున్న నేపథ్యంలో స్థానిక పోలీసులు భారీ భద్రత మరియు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ పర్యటనకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు ఆంక్షలు విధించినట్లు ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ మీడియా ద్వారా వెల్లడించారు. ప్రజా రద్దీని దృష్టిలో ఉంచుకుని జమ్మలమడుగు.. మైదుకూరు హైవే పై రేపు ఉదయం 7:00 గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి రానున్నాయన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. వాహనాల మళ్లింపు వివరాలు కడప మరియు మైదుకూరు వైపు నుంచి ప్రొద్దుటూరు పట్టణంలోకి వచ్చే సాధారణ వాహనాల రాకపోకలను కొత్తపల్లి సర్కిల్, వాసవి సర్కిల్, వైఎస్సార్ సర్కిల్, పార్కింగ్ ఏర్పాట్లు సభ మరియు వివిధ కార్యక్రమాలకు హాజరయ్యే విఐపీలు, సాధారణ ప్రజల వాహనాల కోసం మున్సిపల్ ప్లాట్లలో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలపాలని పోలీసులు స్పష్టం చేశారు. ఏఎస్పీ విజ్ఞప్తి మేరకు ప్రజా సౌకర్యం, భద్రత దృష్ట్యా పోలీసు శాఖ విధించిన ఈ ట్రాఫిక్ మళ్లింపులను వాహనదారులు, స్థానిక ప్రజలు గమనించి సహకరించాలని ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ కోరారు. ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఏఎస్పి విభూ కృష్ణ ప్రజలకు మరియు వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.



# సినిమా న్యూస్



## ఇక కోత నాది లెక్క మీది!

టాలీవుడ్ ప్రేక్షకులకు అదిరిపోయే మాస్ ఫీస్ట్ ఇచ్చేందుకు హీరో శర్వానంద్, పవర్ ఫుల్ డైరెక్టర్ సంపత్ నంది జతకట్టారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోగి'. 1960ల కాలం నాటి పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతీ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మాత కె.కె. రాధామోహన్ ఈ సినిమాను నిర్మిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో తన సంగీతంతో అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి తాజాగా సంపత్ నంది ప్రేక్షకులకు డబుల్ ట్రీట్‌ఇచ్చారు. సినిమా టీజర్‌ను రిలీజ్ చేయడంతో పాటు, నవంబర్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. "కోత నాది లెక్క మీది.. కుమ్మరోల్ల గంగ" అనే క్యాప్షన్ జత చేశారు.

ఇక విడుదలైన టీజర్ విషయానికి వస్తే.. 'అనగనగా ఒక ఊరు బొగ్గులగుట్ట.. అక్కడ పటేల్ రాచరికం' అనే వాయిస్‌ఓవర్‌తో విజువల్స్‌ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఊరుపై దండెత్తే కిరాతక అనుచరుల నేపథ్యం, ఆ పటేల్‌కు వ్యతిరేకంగా హీరోయిన్ అనుపమ చెప్పే డైలాగ్స్ సినిమాలో సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తున్నాయి. ఇక శర్వానంద్ ఎంట్రీ అయితే మాస్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించేలా ఉంది. రస్టిక్ అండ్ రౌద్రమైన లుక్‌లో కుమ్మరోళ్ల గంగ పాత్రలో శర్వా కనిపిస్తూ, శత్రువుల తలలు నరికే యాక్షన్ సీక్వెన్స్‌లు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. ముఖ్యంగా టీజర్ చివర్లో శర్వానంద్ చెప్పిన మాస్ డైలాగ్స్ హైలైట్‌గా నిలిచాయి. "ఎట్లనో నేను సూస్తా పటేలా.. నేను సెయ్యా.. సెయ్యనియ్యా.. సచ్చినా మా అమ్మయ్యలా తోడు.. ఆ తొమ్మిది మెట్లను నా కత్తితో కడిగి మీ నెత్తిటితో కడగకపోతే నా పేరు కుమ్మరోల్లా గంగానే కాదు" అంటూ ఆయన చెప్పిన తీరు సినిమా స్థాయిని పెంచేసింది.




## సింగీతం శకం ముగిసింది!



ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూశారు. సుమారు 94 ఏళ్ళ వయసులో వయోభారంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు సమాచారం. దీంతో తెలుగు సినీ పరిశ్రమ మాత్రమే కాదు యావత్ భారత సినీ జగత్తు తీవ్ర విషాదంలో మునిగిపోయింది. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ, భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తన జీవితంలో ఇటీవలే అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్ బ్యానర్‌పై, యువ దర్శకుడు నాగ్ అశ్విన్ సమర్పణలో ఆయన దర్శకత్వం వహించిన సరికొత్త చిత్రం 'సింగ్ గీతం' ప్రేక్షకులతో పాటు సినీ విమర్శకుల ప్రశంసలను అందుకుంది. సినిమా చరిత్రలో తొలిసారిగా సంభాషణలను సైతం సంగీతమయంగా మార్చే పూర్తి స్థాయి 'ఆల్-మ్యూజికల్' ఫార్మాట్‌లో ఈ ప్రాజెక్ట్‌ను డిజైన్ చేశారు. సాధారణ డైలాగులు కాకుండా, పాత్రల భావోద్వేగాలన్నీ స్వరాల రూపంలోనే సాగడం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన సింగీతం శ్రీనివాసరావు, ప్రతి దశాబ్దంలోనూ ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. టాకీ కాలంలో మాటలు లేని నిశ్శబ్ద హాస్య చిత్రం పుష్పక విమానంతో దేశవ్యాప్తంగా సంచలనం. భారతీయ వెండితెరకు కాల ప్రయాణం కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన మార్గదర్శక సైన్స్ ఫిక్షన్ ఆదిత్య 369 కూడా ఆయన సృష్టే. ఆధునిక కంప్యూటర్ గ్రాఫిక్స్ లేని కాలంలోనే లెన్స్ ట్రిక్స్‌తో అపూర్వ సహోదరులుతో మరుగుజ్జు పాత్రను సృష్టించి సాంకేతిక విస్మయం కలిగించిన తీరు ఇప్పటికీ మర్చిపోలేరు. దశాబ్దాల సినీ ప్రయాణంలో నిరంతరం కొత్తదనాన్ని అన్వేషించిన సింగీతం శ్రీనివాసరావు, ఈ వయసులోనూ సరికొత్త ఆలోచనలతో కథలను తెరకెక్కించవచ్చని నేటి తరం దర్శకులకు ఆదర్శంగా నిలిచారు అనడంలో సందేహం లేదు.

## అది అసభ్య స్పర్శ కాదు

ప్రముఖ నటి రచిత రామ్‌కు సంబంధించిన కొన్ని వీడియోలు గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రీసెంట్‌గా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆమెను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఆ సమయంలో ఆనందంతో ఉత్సాహంగా ముందుకు వచ్చిన ఒక అభిమాని, అనుకోకుండా రచిత రామ్ చెంపలను గిల్లడంతో ఆమె ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో, కొందరు నెటిజన్లు దీనిపై రకరకాల విమర్శలు చేస్తూ తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. సోషల్ మీడియాలో ఈ వ్యవహారం పెద్ద దుమారమే రేపింది. ఈ నేపథ్యంలో తాజాగా స్పందించిన రచిత రామ్.. ఆ వివాదానికి తనదైన శైలిలో చెక్ పెడుతూ షాకింగ్ కామెంట్స్ చేశారు. అభిమాని ప్రవర్తనను తప్పుపట్టాల్సిందిపోయి, ఆమె చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యపరిచాయి.



అభిమానులు తన పట్ల చూపించిన ఆప్యాయతలో ఎలాంటి దురుద్దేశం లేదని, అదే విషయాన్ని తాను కూడా స్పష్టం చేశానని ఆమె తెలిపారు. "ఈ ఘటన తర్వాత నా స్నేహితులు నన్ను ఫోన్ చేసి 'అయ్యో, నీకు కోపం రాలేదా?' అని ఆశ్చర్యంగా అడిగారు. కానీ చిన్నపిల్లలను ఎవరైనా ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవడం లేదా ముద్దుగా తాకడం ఎంత ముచ్చటగా ఉంటుందో, నా అభిమాని కూడా నన్ను అలాగే తాగారు" అని చెప్పినట్లు గుర్తుచేసుకున్నారు. అది ఏమాత్రం అసభ్యకరమైన స్పర్శ కాదని, ఒకవేళ అది నిజంగానే తప్పుగా అనిపిస్తే తాను క్షణంలో ఖండించేదాన్ని అని రచిత స్పష్టం చేశారు. ఎవరైనా సరే అంత స్వచ్ఛమైన అభిమానాన్ని, ప్రేమను చూపిస్తున్నప్పుడు తాను దాన్ని ఎలా తప్పుబట్టగలనని ప్రశ్నించారు. నిజానికి ఆ క్షణం తనకు చాలా బాగా నచ్చిందని, అందులో ఎలాంటి తప్పు లేదని అన్నారు. ఆమె స్పందించిన తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ఏఐ మార్ఫింగ్‌పై జాన్వీ ఫైర్!

మహిళల గౌరవానికి భంగం కలిగించేలా సాగుతున్న ఏఐ మార్ఫింగ్ వీడియోల వివాదంపై సినీ నటి జాన్వీ కపూర్ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఆమె పంచుకున్న లేఖ సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, శరీర హక్కులు, డిజిటల్ భద్రతపై ఆమె ప్రశ్నలు సంధించారు. మహిళల అనుమతి లేకుండా కల్పిత కంటెంట్‌ను ప్రచారం చేయడం నేరపూరిత ధోరణి మాత్రమే కాదు, అది లైంగిక దాడితో సమానమైన చర్య. చిత్ర పరిశ్రమలోని దాదాపు ప్రతి మహిళ ఏదో ఒక సందర్భంలో ఈ రకమైన వేధింపులను ఎదుర్కొంది. మహిళ ఐదు రోజులు వరుసగా 'సరే' అని చెప్పి, ఆరో రోజు 'వద్దు' అని చెబితే, ఆ తిరస్కరణను కచ్చితంగా గౌరవించాల్సిందేనని జాన్వీ స్పష్టం చేశారు. మహిళ ఏ దుస్తులు వేసుకున్నా, ఏ కోణంలో కెమెరా పెట్టి అసభ్యంగా చిత్రీకరించే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. సమాజంలో మహిళల భద్రత కోసం కేవలం "కూతుళ్లను కాపాడుకోండి" అని చెప్పడం పరిష్కారం కాదని ఆమె విమర్శించారు. ఇతరుల హద్దులను ఉల్లంఘించే హక్కు తమకు ఉందనే భావజాలాన్ని సమాజం నుంచి సమూలంగా తుడిచిపెట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.



తాను ఎదుర్కొన్న ఏఐ వీడియోలు ఒక భాగం మాత్రమేనని, మహిళగా నిత్యం ఎదురయ్యే తీర్పులు, చూపులు, శారీరక భయాలు ఇప్పుడు డిజిటల్ ప్రపంచంలోకి మరింత విస్తరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయంపై గళమెత్తి, అండగా నిలిచినందుకు జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ సమస్యపై స్పందించి, తప్పును తప్పని ఎత్తిచూపిన మెగాస్టార్ చిరంజీవి, విజయ్ దేవరకొండ, ఖుష్బూలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళను ఒక మనిషిగా గుర్తించి గౌరవించడం చాలా పెద్ద కోరికేమీ కాదని చెబుతూ, "ఆమె శరీరం, ఆమె ప్రతిష్ట, ఆమె సరిహద్దులు, ఆమె ఎంపిక" అనే నినాదంతో ఆమె తన స్పందనను ముగించారు.

## 'ఫౌజీ' ఇమాన్వికి షాకేనా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కాంబినేషన్‌లో ఒక సినిమా ఆఫర్ వస్తే ఏ హీరోయిన్ అయినా ఎగిరిగంతేస్తుంది. కానీ డెబ్యూట్ మూవీలోనే రెబెల్ స్టార్ సరసన నటించే అవకాశం దక్కించుకున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఇమాన్వి నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ'లో ఆమె కథానాయికగా నటిస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్ చుట్టూ జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు ఇమాన్వి కెరీర్ ప్లానింగ్‌పై చర్చకు దారితీశాయి.

'ఫౌజీ' సినిమా అనౌన్స్‌మెంట్ నుంచి ఇప్పటివరకు ఇమాన్వి ఈ ప్రాజెక్ట్ కోసమే దాదాపు రెండేళ్ల సమయాన్ని కేటాయించింది. మరోవైపు ఆమె వయస్సు 30 దాటడంతో కెరీర్‌కు ఎంతో కీలకమైన ఈ సమయంలో ఒకే సినిమాపై ఇన్ని ఏళ్లు వెచ్చించడం ఎంతవరకు కరెక్ట్ అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఫౌజీ సెట్స్‌పై ఉండగానే ఇమాన్వికి టాలీవుడ్, కోలీవుడ్ నుంచి పలు ఆఫర్లు తలుపు తట్టినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆమె కొత్త ప్రాజెక్ట్‌లకు సైన్ చేయడానికి నిరాకరిస్తూ ఆ ఆఫర్లను రిజెక్ట్ చేసింది. ప్రభాస్ వంటి బిగ్ స్టార్ సరసన నటిస్తున్నప్పుడు వచ్చే గుర్తింపు వేరుగా ఉంటుందని భావించింది. వాస్తవానికి 'ఫౌజీ' చిత్రాన్ని డిసెంబర్ 3న గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ భావించారు. కానీ అనుకోని క్వాలిటీ కారణాల వల్ల ఈ సినిమా విడుదలను మేకర్స్ వాయిదా వేశారు. దీంతో ఇమాన్వి డెబ్యూట్ మరింత ఆలస్యం కానుంది. బిగ్ ప్రాజెక్ట్ కోసం సైన్ చేసి కామ్‌గా ఉండటం ఆమె కెరీర్‌కి ప్లస్ అవుతుందా లేక వేస్టింగ్ టైమ్ అవుతుందా అనేది 'ఫౌజీ' రిజల్ట్ వచ్చాకే తేలనుంది.